క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

నగరి : పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అభినందించారు. నగరి కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం జనరల్‌లో మూడవ సంవత్సరం చదువుతున్న ఎంవి గోపి రాష్ట్రస్థాయిలో 49వ ర్యాంకు, జి. భాస్కర్ 55వ ర్యాంకు, మహేష్ 148వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో టి.నందకుమార్ 23వ ర్యాంకు, సి.తిరుమలయ్య 196వ ర్యాంకు సాధించారన్నారు. లాసెట్ ప్రవేశ పరీక్షలో డి.మీనాక్షి, డి.మునిరూబిని, టి.తిరుమలయ్యకు ఉత్తమ ర్యాంకులు వచ్చాయన్నారు. 16 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. నగరి కళాశాలలోని బీకాం కంప్యూటర్స్ ఫైనాన్స్, బీబీఏ డిగ్రీలో పాటు పీజీ ఎంకాం కోర్సు, పీహెచ్‌డీ రీసెర్చ్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

సింగిల్‌విండో ఇన్‌చార్జ్‌గా కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న కేవీఆర్ కుమార్

నగరి : నగరి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా చిత్తూరు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీఆర్ కుమార్ నియమితులయ్యారు. శనివారం నగరి పీఏసీఎస్‌కు విచ్చేసిన ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇన్‌చార్జ్‌ను సీఈఓ తులసి పిళ్లై, సిబ్బంది దుశ్శాలువలతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ పీఏసీఎస్ వ్యవహారాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగిస్తూ అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు.

నేడు దుర్యోధన వధ ఘట్టం


వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త రాధారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానంతో పాటు వసతులు కల్పిస్తున్నామన్నారు.

వెన్న అలంకరణలో కాలభైరవ స్వామి



నగరి : కాలభైరవ అష్టమి పూజల్లో భాగంగా స్థానిక కామాక్షీ సమేత కరకంలేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామికి చేపట్టిన వెన్న అలంకరణలో భక్తులను ఆకట్టుకుంది. శనివారం విశేష అష్టమి పూజల సందర్భంగా కాలభైరవ స్వామికి ప్రత్యేక అభిషేక, అర్చనలు చేశారు. అనంతరం వెన్నముద్దలతోను, ద్రాక్ష పండ్లతో స్వామివారికి అలంకరించారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముక్కంటి ఆలయ ఈఓగా ఎస్‌వీఎస్ఎన్ మూర్తి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయ ఫుల్ అడిషనల్ చార్జ్ ఈఓగా ఎస్‌వీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈఓగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ముక్కంటి ఆలయ ఈఓగా తిరుపతి దేవదాయశాఖలో రీజనల్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్‌వీఎస్ఎన్ మూర్తిని నియమించారు. గత శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో ఈయన ప్రత్యేక అధికారిగా పనిచేశారు.

గిట్టుబాటు ధర కల్పించండి

గుడిపాల: రైతులందరికీ గిట్టుబాటు ధర కల్పించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోతాపురికి కిలో రూ.30 తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తమిళనాడు నుంచి వచ్చిన వాహనాలను అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిసిందని, చిత్తూరు నియోజకవర్గం నుంచి వచ్చిన వాహనాలకు ముందస్తుగా అనుమతులు ఇవ్వాలన్నారు. కిలో మామిడికాయలకు రూ.30 తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన ఫ్యాక్టరీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పడదాం





ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, వీఆర్ కుప్పం సచివాలయం వద్ద ఇంకుడుగుంత నిర్మిస్తున్న ఉపాధిహామీ కూలీలు

జలమే జీవకోటికి జీవనాధారం నీరు లేని చోట జీవమనుగడ సాధ్యం కాదు. నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు భరోసా కలిగేది. అందుకే ప్రతి నీటిబొట్టు పదిలమే ప్రతి ఒక్కరూ వృథాగా పోతున్న నీటిని ఒడిసి పడితేనే తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినవారవుతారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ భూగర్భజలాలు అడుగంటుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం గతేడాది జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూఫ్ వాటర్ హార్వెస్టర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటు
- భూతాపాన్ని అరికట్టడమే లక్ష్యం
- భవిష్యత్ తరాలకు నీటి సమస్య రాకుండా రూఫ్ వాటర్ హార్వెస్టర్ల నిర్మాణం
- ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహం

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో మండలవ్యాప్తంగా రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ఏర్పాటుకు పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకు వెళ్తున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎర్త్ వర్క్ మెటీరియల్, ఉపాధి కూలీల వేతనాలు, పైపులైన్ వేయడానికి మొత్తంగా రూ.42 వేల ఖర్చుతో రెండు మీటర్ల వైశాల్యం ఉన్న ఒక్కో స్ట్రక్చర్ నిర్మిస్తున్నారు. పాలసముద్రం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల వద్ద ఇప్పటికే ఇంకుడు గుంతలను పూర్తి చేశారు. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు వృథాగా పోకుండా నేరుగా రూఫ్‌వాటర్ హార్వెస్టర్ స్ట్రక్చర్ ద్వారా భూమిలోకి వెళ్లేలా నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాంగణాలు వర్షపు నీటితో అధ్వానంగా మారకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి భూగర్భజలాలను సంరక్షించేందుకు జిల్లా ఉపాహామీ పథకం అధికారులు దృష్టి సారించారు.

ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు..

ప్రభుత్వం పేదలకు స్థలాలు ఇచ్చి ఏర్పాటు చేసిన లేఅవుట్లలో నిర్మించే గృహాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించే ఏర్పాటు చేశారు. ముండలంలో ఇప్పటికే కొన్ని ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయింది. ఇంటి ఆవరణలో ఉన్న స్థలాన్ని ఒకటి లేదా రెండు మీటర్ల వెడల్పు గల ఒరలు ఏర్పాటుచేసి దాంట్లో చిన్నసైజు రాళ్లు, కొబ్బరి పీచు, బొగ్గు, ఇసుకను పొరలుగా వేస్తున్నారు. వర్షం పడినప్పుడు ఇంటిపై నుంచి వచ్చే నీరు నేరుగా ఇంకుడు గుంతలోకి చేరేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్ట్రక్చర్‌కు ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుంది.



శ్రీరంగరాజుపురం ఆదిఆంధ్రవాడలో ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత

ప్రభుత్వ కార్యాలయాల వద్ద పూర్తి..



భూగర్భ జలసంరక్షణ అనేది ఎంతో అత్యవసరం. భూతాపాన్ని నివారించేందుకు, భవిష్యత్తు తరాలకు భూగర్భజలాలను సమృద్ధిగా అందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను ఇప్పటికే పూర్తి చేశాం.

– ఆర్.రామనాథరెడ్డి, ఎంపీడీఓ, పాలసముద్రం

భూగర్భజలాలు పెరుగుతాయి..



ఇంటి పైకప్పుపై కురిసిన వర్షం నీరు వృథాగా పోకుండా కొద్దిపాటి స్థలంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపునీటిని అందులోకి ఇంకించవచ్చు. దీనికి పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లే దు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు మాత్రం ఎంతో అ ధికం. ఇంకుడు గుంతలు ఉన్న చోట భూగర్భ నీటి మట్టం గణనీయంగా పెరుగుతుంది.

– మార్గరేట్, ఏపీఓ

ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుంది



ఇంటి ఆవరణలో ఒకటి లేదా రెండు మీటర్ల వెడల్పు గల ఒరను ఏర్పాటు చేయాలి. దాంట్లో చిన్నసైజు రాళ్లు, కొబ్బరి పీచు, బొగ్గు, ఇసుకను పోయించాలి. ఇంటి పైఆవరణలో కురిసిన వర్షపునీరు నేరుగా ఇంకుడు గుంతలోకి చేరేలా చూడాలి.

– అనుషా, ఉపాధిహామీ జేసీ

డయేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టండి



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఈ

నగరి : అతిసారం, డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఎస్ఈ కె.విజయ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం నగరి, నింద్ర, విజయపురం మండలాల్లోని ఆవాసాలలో తాగునీరు, పారిశుద్ధ్యం పనులను ఆయన పరిశీలించారు. అతిసారం, డయేరియా ప్రబలకుండా మంచినీటి సరఫరాకు జాగ్రత్తలు సూచించారు. ఎక్కడా పైపులైన్ లీకేజీ లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా ట్యాంకులు, పైపులైన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. రక్షిత నీటి సరఫరా ట్యాంకులు విధిగా 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని సూచించారు. శుభ్రపరిచిన తేదీ, తదుపరి శుభ్రపరుచు తేదీని ట్యాంక్ వద్ద ప్రదర్శించాలన్నారు. ట్యాంక్ నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు. క్లోరినేషన్ మోతాదు 0.2 పీపీఎం మించకుండా క్లోరోస్కోప్ ద్వారా పరీక్షించాలని సూచించారు. తాగునీటి సమస్య ఎక్కడా రాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యంఆర్.సతీష్ కుమార్, ఏఈలు ఆర్.శైలేంద్ర, కె.అంజేరయ్య, కెవి.శ్రీకాంత్, విజయపురం మండల మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కీమ్ వర్కర్లు

నగరి : అంగన్‌వాడీ ఆశా వర్కర్లకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులైన స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య వినతిపత్రం అందించారు. నగరి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వారితో కలిసి ఎమ్మెల్యేను కలిసిన ఆయన అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కోదండయ్య తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, సీనియర్ ప్రాజెక్టు నాయకులు కస్తూరి, మునియమ్మ, విజయ, రమణమ్మ, శాంతి, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ సభ్యులు పరిమళ, కృష్ణవేణి, శివగామి, వేణి, సారిక, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జి విష్ణువర్మ



పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర

నగరి : స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 48 కేసులు పరిష్కారం కాగా రూ.48.12 లక్షలు సెటిల్‌మెంట్ అయింది. జడ్జి ఎస్.విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సివిల్, బ్యాంకు కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 48 కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్‌అదాలత్‌లో ఏపీపీ రామశాంతి, బార్ ప్రెసిడెంట్ జగదీష్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో 85 కేసులు పరిష్కారం..

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 85 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్‌సీ రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.1,30,55,920 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 54 క్రిమినల్ కేసులు, 24 సివిల్, 7 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. లోక్ అదాలత్ మెంబర్లుగా న్యాయవాదులు శేషాచలం, నదియా, భాస్కర్‌రావు వ్యవహరించారు. పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



కేసుల పరిష్కారం కోసం వేచి ఉన్న కక్షిదారులు

గురువులే విద్యార్థులకు మార్గదర్శకులు



కుమారగురుపరన్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

పుత్తూరు: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడంతో పాటు వారి జీవితాలకు దిశా నిర్దేశం చేసేది గురువులేనని ఎంఈఓ తిరుమలరాజు అన్నారు. మండల పరిధిలోని అక్కేరి దళితవాడలో పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు పి.కుమారగురుపరన్‌ను ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారగురుపరన్ ఉపాధ్యాయుడిగా తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దీనదయాల్‌రెడ్డికి సన్మానం



పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం దీనదయాల్‌రెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు

పాలసముద్రం : పదవీ విరమణ పొందిన తిరుమలరాజుపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.దీనదయాలన్‌ను శనివారం పాఠశాల ఉపాధ్యాయుల బృందం, ఎస్టీయూ నాయకులు వైభవంగా సన్మానించారు. దీనదయాల్‌రెడ్డి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిలా చేరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఎదిగారని కొనియాడారు. 35 ఏళ్ల సర్వీస్‌లో ఆయన విద్యాభివృద్ధికి ఎంతో శ్రమించారని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, మండల పరిధిలోని టీచర్లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు గుణశేఖర్, సుధాకర్, ఉషారాణి, శ్రీనివాసులు, మురుగుదాస్, సీఆర్పీ మహాలక్ష్మి, టీచర్లు కుమార్, ప్రకాష్, చంద్రశేఖర్, ఆనందయ్య, అర్జున్, దేవరాజ్, బాలసుబ్రమణ్యం, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



తులసిరామ్‌రెడ్డి మృతదేహం

గంగాధర నెల్లూరు: మండలంలోని ఒడ్డుపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కోటగరం పంచాయతీ వడ్డుపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు తులసీరామ్ రెడ్డి (34) పొలం వద్ద నుంచి చెరువు కట్టపై ఆవులను పట్టుకుని ఇంటికి వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చిరంజీవి రెడ్డి చెరువు కట్టపై ట్రాక్టర్ నడుపుకుంటూ రాగా ఆవులు బెదిరిపోవడంతో చిరంజీవి రెడ్డి వాటిని తప్పించబోయి తులసీరామిరెడ్డిని ఢీకొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య మోనిక ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్ఐ ఆంజనేయులు రెడ్డి తెలిపారు. మృతుడు తులసీరామ్ రెడ్డికి ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

స్వయం సమృద్ధి సాధించండి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ డైరెక్టర్ ప్రేమ్‌సాగర్

శ్రీరంగరాజపురం : మహిళలు వృత్తి నైపుణ్యాలలో స్వయం సమృద్ధి సాధించండి అని ఈడీపీ(వ్యవస్థాపక స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ) డైరెక్టర్ ప్రేమ్‌సాగర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇండియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ ఆధ్వర్యంలో ఈడీపీ సంస్థ ద్వారా పెద్దతయ్యూరు గ్రామంలో గత 10 రోజులుగా వివిధ రకాల చేతి వృత్తులు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వరకు మహిళలు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళలు సమీప (వ్యవస్థాపక స్కిల్ డెవలప్మెంట్ సంస్థ) కేంద్రంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాంగా శిక్షణ పొందిన 35 మంది మహిళలు స్థానిక సర్పంచ్ వరదమ్మ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సర్పంచ్ వరదమ్మ అన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటరమణయ్య, వసంతకుమార్, ఎస్‌జీఓ సభ్యులు మునికృష్ణ, భూపాతి, రవి, తులసిమణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు: జూలై నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలుకు పెంచిన మొత్తంతో పాటు నిల్వ మొత్తం కలిపి రూ.7 వేలను పింఛన్‌దారులకు అందజేయాలని తెలిపారు. పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందజేయాలని స్పష్టం చేశారు.



సదస్సుకు హాజరైన సచివాలయాల సిబ్బంది

పర్యావరణ రక్షణ మన బాధ్యత



మొక్కలు నాటుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

వెదురుకుప్పం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు సిద్ధయ్య అన్నారు. శనివారం మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో పుత్తూరు వెంకటేశ్ పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థులకు గ్రూప్ లీడర్ కామసాని చంద్రవనిత ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా మానవాళి మనుగడకు రక్షణగా ఉంటుందన్నారు. ఆధునిక బోధనోపకరణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు సామాజిక సేవ ప్రాజెక్టు పనులు చేపట్టారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రూప్ లీడర్ కామసాని చంద్రవనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన



ఇంటర్నెట్ వినియోగంపై గ్రామస్తులకు, విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం

పాలసముద్రం: మండలంలోని వీర్లగుడి ప్రాథమికోన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో సమాజసేవ ప్రాజెక్ట్ వారు శనివారం గ్రామస్తులకు, విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గ్రామంలో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ పాఠాశాల ఆన్‌లైన్ చదవడం వంటివని ఆన్‌లైన్ సేవలు ఎలా ఉపయోగించాలో వివరించారు. విద్యార్థులు గ్రామస్తులకు ఇంటర్నెట్ ఉపయోగం ద్వారా పొందగలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా విద్యా, ఆరోగ్యం, వ్యవసాయం, ప్రభుత్వ సేవలు వంటి అంశాల్లో ఇంటర్నెట్ వినియోగం ఎంత ముఖ్యమో చెప్పి ప్రాక్టికల్ సెషన్‌ను నిర్వహించారు. గ్రామ ప్రజలు డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంచుతుందని వారి జీవితాలను మెరుగు పరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు దిలీప్ కుమార్, ఆసిఫ్, యహియా, మోహన్, రాజు, నందకిషోర్, యతిన్, త్రిలోక్, జ్ఞానేశ్వర్, కిషోర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ నాణ్యత పెంపునకు చర్యలు



డెయిరీ నిపుణులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలారావు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలారావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి.. కొనుగోలు చేసిన నెయ్యి మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై తెలియజేయాలని నిపుణులను కోరారు. లడ్డూ నాణ్యతను ప్రముఖ డెయిరీ నిపుణులు విజయ భాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. నాణ్యమైన నెయ్యి ప్రామాణిక విలువల గురించి తెలిపారు. త్వరలో లడ్డూ నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. సమావేశంలో జేఈవో గౌతమి, ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జీఎం మురళీకృష్ణ, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెంపో బోల్తా ఆరుగురికి గాయాలు



గుడిపాల: మండలంలోని శనివారం ఓ టెంపో ట్రావెల్స్ బోల్తా పడడంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. తెలంగాణ నుంచి బయలుదేరిన వాహనం తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్‌కి వెళుతుండగా అనుపు వద్ద ముందు ఓ ప్రైవేట్ బస్సు హఠాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొని అదుపు తప్పి ఓ పక్కకు పడింది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.